నిజమైన సంక్షోభం

జె కృష్ణమూర్తి

నిజమైన సంక్షోభం

సమస్త ప్రపంచం సంక్షోభంలో ఉన్నది. చరిత్రలోకి తొంగి చూశామంటే అక్కడ అన్నీ మనిషి తయారు చేసుకున్న విపత్తుల కథలే కనబడతాయి. ఈ ఉత్పాతాలు వరుసగా జరుగుతున్నట్లుగా కూడా కనబడుతుంది. ఏమాత్రం వరుస తప్పకుండా మళ్ళీ మళ్ళీ జరుగుతూనే వస్తున్నాయి. ప్రతిసారీ ప్రపంచం వాటిని చూసి విస్తుపోతునే ఉంటుంది. అవాక్కయి పోతునే ఉంటుంది. గొప్ప గొప్ప పండితులు, నిపుణులు, మేధావులు, వివిధ రంగాల్లో ఔన్నత్యం సాధించినవారు విశ్వసనీయంగా చెప్పే పలుకులను, ఇచ్చే హామీలను, అవీ ఇవీ గణించి కట్టిన సూత్రాలను, భవిష్యవాణులను లెక్క చేయకుండా విపత్తులు జరుగుతునే ఉన్నాయి. తర్కం, హేతువాదం, కారణవాదం మొదలైన వాటి నన్నింటినీ వమ్ము చేస్తూ వాటి పాటికి అవి జరుగుతునే ఉన్నాయి. మానవులు దిక్కుతోచని స్థితిలో, గందరగోళంలో, నిస్సహాయులై కొట్టుమిట్టాడుతునే ఉన్నారు. ఒక సంక్షోభానికీ మరో సంక్షోభానికీ మధ్య నున్న వ్యవధినే మనం సాధారణమైన సవ్యమైన జీవితం అంటున్నాం. సవ్యమైన సాధారణ జీవన స్థితి అని మనం అంటున్న ఆ సమయంలో మన కాలాన్ని, మన శక్తిని ఎన్నింటికో వెచ్చిస్తాం తప్ప, అసలు మానవ జీవితానికి గల ఉద్దేశ్యం - ప్రయోజనం ఏమిటి? అనే అంశం గురించి గాని, అంతకంటే ముఖ్యంగా నా జీవిత ప్రయోజనం ఏమిటి అనే అంశం గురించి కాని లోతుగా ఆలోచించనే ఆలోచించం. మన వ్యక్తిగత నిత్యజీవనమే ఒకవేళ మహా విపత్తేమోనా అని కాని, ఇక ముందు రాబోయే ప్రపంచ సంక్షోభానికి ఇదే కారణభూతమా అని కానీ ఎన్నడూ ప్రశ్నించి చూసుకోము.

అసలు అటువంటి ప్రశ్నే మనకు ఎన్నడూ తట్టదు. ఒకవేళ తట్టినా దానిని పక్కకు తోసివేస్తాం. సూటిగా ఎదుర్కోము.

జె. కృష్ణమూర్తి మన పైకి సంధించిన సవాలు ఇదే. అనేకమైన మౌలిక ప్రశ్నలను అతి ప్రధానమైన ప్రశ్నలను మన ముందు పెట్టి వాటిని సూటిగా ఎదుర్కోమని చెప్తున్నారు. వాటిలో కొన్నింటిని ఇక్కడ పొందుపరచడం జరిగింది. సుమారు అయిదు దశాబ్దాల పాటు (1934 నుండి 1985 వరకు) సాగిన అతడి ప్రసంగాల నుండి, అతడు చేసిన రచనల నుండి ఇవి సేకరించబడ్డాయి.

© 2020, Krishnamurti Foundation India

నిజమైన సంక్షోభం

Madras, 22 October 1947; The Collected Works, Vol. IV.

ఈ ప్రస్తుత ప్రపంచ సంక్షోభం కనీవినీ ఎరగని ఒక మహా వైపరీత్యం. ఇప్పుడు ఉన్న ఈ సంక్షోభం మనిషి జీవితంలో సాధారణంగా తరచు వచ్చే విపత్తుల వంటిది కాదు. ఇది ప్రపంచ మంతటా విస్తరించి ఉన్న అల్లకల్లోల పరిస్థితి. ఇది ఒక్క ఇండియాకో యూరపుకో పరిమితమై లేదు. ప్రపంచంలోని మూల మూలలకూ వ్యాపితమై ఉన్నది. మానవ శరీరపరంగా చూసినా, మానసికపరంగా చూసినా, నీతిపరంగా కానీ ఆధ్యాత్మిక పరంగా కానీ చూసినా, ఆర్థిక రంగంలో కానీ సామాజిక రంగంలో కానీ ఎక్కడ చూసినా గందరగోళము, అస్తవ్యస్తత, నిజాయితీ లేకపోవడము కనబడుతున్నాయి. కొండ శిఖరపు అంచుపై మనం నిలబడి ఉన్నాం. అంచుపై నిలబడి అతి అల్పమైన వ్యవహారాల గురించి కలహించుకుంటున్నాం. ఇప్పటి ఈ ప్రపంచ సంక్షోభంలో గల అపారమైన అపాయం గురించి, అతిక్లిష్టమైన పరిస్థితి గురించి ఎవ్వరూ ఊహించినట్లు లేదు. ఇది ఎంత అసాధారమైనదో, ఎంత లోతైన ఆందోళనలకు గురి చేస్తుందో, ఎంతగా తల్లక్రిందులు చేయనున్నదో మనం గ్రహించడం లేదు. అపారమైన ఈ అస్తవ్యస్త స్థితిని గురించిన గ్రహింపు కల కొందరు తమ జీవన రీతులను, పద్ధతులను సవరించి మార్చుకోవడంలో మునిగి ఉన్నారు. వారిలో ఎంతో గందరగోళం ఉండటం వల్ల తమ పనులతో మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. తమ తమ వృత్తులకు అంకితమైపోయిన మేధావులు, బుద్ధిజీవులు, నిపుణులు ఈ ప్రపంచాన్ని ఏనాటికీ కాపాడలేరు. మానవుని జీవన ప్రక్రియలో, ఆ మొత్తంలో ఒక భాగం మాత్రమే అయిన మేధ పరాజయం చెందక తప్పదు. ఎందుకంటే మేధ ఇచ్చే పరిష్కారాలు, సమాధానాలు పాక్షికమైనవి. అందుచేత అవి సత్యం కాదు.

నిజమైన సంక్షోభం

Madras, 22 October 1947; The Collected Works, Vol. IV.

ఈ మహా విపత్తు ఏదో విధివశాన జరిగినది కాదు. మనలో ప్రతి ఒక్కరమూ దీనిని తయారు చేశాం. మన రోజువారీ కార్యకలాపాలైన ఈర్ష్య, ఉద్రేకాలతో, అత్యాశలతో, అధికారం కోసం, పెత్తనం కోసం అతిలాలస, పోటీలు పడటం, మనలో నిర్దాక్షిణ్యత పెరిగిపోవడం, ఇంద్రియ సంబంధిత విలువలు, కృతకమైన విలువలు వంటి వాటితో మనమే ఈ పెను విపత్తును తెచ్చిపెట్టుకున్నాం. ఈ పరమ దారుణమైన దైన్యస్థితికి, అస్తవ్యస్తతకు మనమే బాధ్యులం. వేరే ఎవరో బాధ్యులు కాదు. మీరూ నేనే. ఎందుకంటే ఆలోచనా లేమిలో, స్పృహలేని స్థితిలో ఉండి, మీమీ ఆకాంక్షల్లో నిండా మునిగిపోయి, ఇంద్రియ సంచలనం కలిగించే వ్యాపకాల్లో మునిగి తేలుతూ, తక్షణమే తృప్తినివ్వగల, తనివి తీర్చగల విలువలను పట్టుకొని వేలాడుతూ, మీరే ఈ విపరీతమైన, ప్రపంచాన్ని అంతటినీ ముంచెత్తుతున్న ఈ పెను విపత్తును తెచ్చి పెట్టుకున్నారు... ఈ ప్రళయానికి మీరే బాధ్యులు. ఏ ఒక్క ఫలానా సమూహమో బృందమో కాదు. ఏ ఒక్క వ్యక్తి కాదు. బాధ్యులు మీరే.

నిజమైన సంక్షోభం

New Delhi,
14 November 1948;
The Collected Works, Vol. V.

సరే, ఆధునిక ప్రపంచం అంటే ఏమిటి? సాంకేతిక నైపుణ్యాలతో, కార్య సమర్థతతో నడిపించబడుతున్న పెద్ద పెద్ద సంస్థలతో నిర్మించబడినదేనా ఆధునిక ప్రపంచం అంటే? సాంకేతిక రంగంలో చూస్తే అద్భుతమైన ప్రగతి కనబడుతుంది. అధిక సంఖ్యాకుల వైపు ప్రజా బాహుళ్యం వైపు చూశామంటే వారిలో లేమి! ఆహార పదార్థాలు కాని, వస్తువులు కాని వారికి సమానంగా అందడం లేదు. ఉత్పత్తి సాధనాలు సమస్తమూ కొద్ది మంది చేజిక్కించుకొని తమ ఆధీనంలో ఉంచు కొన్నారు. జాతీయ భావాలు జాతుల మధ్య సంఘర్షణలకు కారకమయ్యాయి. యుద్ధాలు జరుగుతునే ఉన్నాయి. వాటికి అంతం ఉండటం లేదు. ఎందుకంటే ప్రభుత్వాలు సామ్రాజ్యాధి పత్యాలుగా స్థిరపడి పోయాయి. ఇదీ ఆధునిక ప్రపంచం అంటే. అంతే కదూ? సాంకేతిక పరమైన అభివృద్ధి జరిగింది కానీ దానికి సమమైన, అంతే శక్తివంతమైన మానసిక పరిణతి జరగలేదు. అందుచేత ఇప్పుడున్న ఈ స్థితిలో సమతుల్యత లేదు.

వైజ్ఞానిక రంగంలో కనీవినీ ఎరుగని అద్భుతాలను సాధించారు. అదే సమయంలో మానవ జీవితంలో దారుణమైన దుస్థితి. డొల్లబారిన హృదయాలు, ఖాళీ మనసులు కనబడుతున్నాయి. ఇదీ ఈ ఆధునిక ప్రపంచపు తీరు. అంటే అది మీరే. ప్రపంచం వేరూ మీరు వేరూ కాదు. మీ ప్రపంచం అంటే అది మీరే. ఆ ప్రపంచంలో ఉన్నది పెంచి పోషించుకున్న మేధ, రిక్త హృదయాలు.

నిజమైన సంక్షోభం

*Madras,
25 December 1982;
Mind Without
Measure.*

పెను సంక్షోభం వచ్చి పడింది. ఈ సంక్షోభం ఉన్నది ప్రపంచంలో కాదు. ఈ సంక్షోభం అణుయుద్ధం కాదు. మహా భయంకరమైన విభేదాలు కాని విభజనలు కానీ కాదు. ఎక్కడ చూసినా ఎప్పుడూ అంతులేకుండా కొనసాగుతూ పోతున్న అమానుష హింసాకృత్యాలు కాదు. ఈ పెను సంక్షోభం మన చేతనలో ఉన్నది. మనం ఏమిటో అదే ఈ సంక్షోభం. మనం ఎలా తయారయ్యామో అదే ఈ పెను సంక్షోభం.

ఈ సంక్షోభం ఉన్నది మానవ చేతనలో

జీవిత పవిత్రత నుండి మనిషి దూరమైపోయాడు

నిజమైన సంక్షోభం

Bombay,
28 January 1968;
Meeting Life.

అనేక వేల సంవత్సరాలుగా జీవిస్తున్న ఈ మానవుడు ఎందుకని ఇటువంటి దారుణ దుర్దశలో, ఇటువంటి సంఘర్షణలో చిక్కుకొని పోయాడు? ఇది దాపురించినది ఎప్పుడు? ... అధిక జనాభా కారణంగా అనో, నీతినియమాలు కోల్పోవడం వల్ల అనో వంటి తేలికైన వ్యాఖ్యానాలు, సమర్థించడాలు పక్కన పెట్టేయండి. సాంకేతిక విజ్ఞానం లేకపోవడం వల్ల, ప్రత్యక్షంగా భావప్రసారం జరిపే వెసులుబాటు లేకపోవడం వల్ల అవి జరిగాయి. సరే, అసలు ఈ పరమ దారుణ దుస్థితికి గల మూల కారణం ఏమిటి? ఈ బాధలకు వెనక గల అత్యంత ప్రధాన కారకం ఏది? ఈ దేశంలో, ఎక్కడయితే మంచితనం, దయాదాక్షిణ్యాలు ఉండాలి అనే, చంపకూడదు, అమానుషత్వం కూడదు అనే నియమాలు సంప్రదాయాలుగా స్థిరపడిపోయాయో అటువంటి ఈ దేశంలో వాటన్నింటిని పూర్తిగా కోల్పోయి ఇటువంటి స్థితి ఎందుకని దాపురించింది? ఇది ఎప్పుడు జరిగింది?

Madras,
26 October 1947;
The Collected Works, Vol. IV.

ఎందుకంటే, ప్రాచీన కాలంలో ఆకాంక్షాపరత్వము, ఆధిపత్యం కొరకు లాలస లేని మనుష్యులు కొందరు ఉండేవారు. అటువంటి మనుష్యులతో కూడిన బృందాలు ఉండేవి. వారిలో అత్యాశలు కాని, దుర్మార్గ పూరితమైన ఊహలు, దుష్టచింతన కాని ఉండేవి కావు. సమాజంలో ఆధ్యాత్మికమైన, నీతిపరమైన క్షీణత వాటిల్లి, సమాజం పతనమై పోకుండా వారు సమాజానికి మార్గనిర్దేశం చేయగలిగారు. అటువంటి వారితో కూడిన బృందాలు ఎంత ఎక్కువ సంఖ్యలో ఉంటే అంత ఎక్కువగా సమాజానికి, ప్రభుత్వానికి రక్షణ, భద్రత లభించేవి. ఈ కారణంగానే భారతదేశం లాగా ఒకటి రెండు దేశాలు మాత్రమే దుర్దశలో అంతమై పోకుండా నిలబడ గలిగాయి. లౌకిక ప్రపంచపు అల్ల కల్లోలాలలో చిక్కుకొని పోకుండా ఉండ గలిగినవారు బొత్తిగా కొద్దిమందే అవడం వల్ల మీరు ఇటువంటి ఈ విపరీతమైన విపత్తులో పడిపోయారు.

*Bombay,
28 January 1978.*

వ్యాధుల వల్ల కలిగే దుఃఖం ఉన్నది. పూర్తిగా ఏకాకిగా అయిపోయానని భావించడం వల్ల మనిషికి కలిగే దుఃఖం ఉన్నది. పేదరికపు దుఃఖం ఉన్నది. దరిద్రులను, అజ్ఞానపు అంధకారంలో, దౌర్భాగ్యంలో మునిగి ఉన్నవారిని, దారి చూపించే ఏ ఆశాదీపమూ కానరాని దిక్కులేని దీనులను చూసినప్పుడు మనకు కలిగే దుఃఖం ఉన్నది. ప్రపంచంలో ఉన్న జంతువులనన్నింటినీ ప్రయోగశాలల్లో చంపుతూ, ముక్కలు ముక్కలుగా నరికి చిత్రవధలు చేస్తూ హతమారుస్తూ ఉంటే చూస్తున్నప్పుడు కలిగే దుఃఖం ఉన్నది.

నిజమైన సంక్షోభం

25 February 1983;
Krishnamurti to Himself.

ప్రకృతితో మనకు బొత్తిగా ఏ సంబంధమూ లేకపోవడం చూస్తుంటే చాలా వింతగా అనిపిస్తుంది. ఈ భూమిపై జీవిస్తున్న అసంఖ్యాకమైన ప్రాణుల ఎడల కనికారము, అనుస్పందన ఏమాత్రం మనకు ఉన్నట్లు కనబడటం లేదు. ఒక ప్రగాఢమైన, అచంచలమైన బాంధవ్యాన్ని కనుక మనం ప్రకృతితో నెలకొల్పుకుంటే మన జిహ్వాచాపల్యం కోసం ఒక్క జంతువును కూడా ఏనాటికీ చంపను గాక చంపము. మన స్వలాభం కోసం ఒక కోతికి గాని, కుక్కకు గాని, గినీ పందికి గాని హాని చేయనే చేయం. లాభాలు ఆర్జించడానికి వాటిని కోసి, పరిశీలించి చేసే పరీక్షలు చేయనే చేయం. మన దేహాల ఆరోగ్యం బాగు చేసుకోవడం కోసమూ, గాయాలు నయం చేసుకోవడానికీ ఇతర మార్గాలు కనిపెడతాము. అయితే మనసును స్వస్థపరచడం అనేది పూర్తిగా భిన్నమైన విషయం . అది వేరు. మీరు కనుక ప్రకృతితో కలిసి జీవిస్తుంటే క్రమక్రమంగా ఆ స్వస్థతను పొందుతారు.

The Whole Movement of Life is Learning: Letters to the Schools, Ch. 67.

ప్రకృతికి దూరంగా జరిగి మనం వెళ్ళి పోతుంటే ఒకరితో ఒకరం కూడా ఏ సంబంధమూ లేకుండా దూరమై పోతాం. పక్షులతోను, సంకోచంతో బెరుకు బెరుకుగా చూసే వల్లంకి పిట్టలతోను కూడా మనకు ఏ సంబంధాలూ ఉండవు. ఇక మీ పిల్లలతో, పాపలతో వీధిలో నడిచిపోతున్న మనుష్యు లతో కూడా సంస్పర్శను, సంబంధాన్ని కోల్పోతారు. ఆహారం కోసం ఒక జంతువును మీరు చంపినప్పుడు మీలోని సున్నితత్వాన్ని కోల్పోతారు. మీలో నిర్దాక్షిణ్యతను పెంచుకుంటారు.

మీలో సున్నితత్వం లేకపోవడమే సరిహద్దులకు ఆవలగా ఉన్న మనిషిని మీ చేత చంపిస్తుంది. అపారమైన జీవన ప్రవాహపు కదలికలతో సంస్పర్శను, సంబంధాన్ని పోగొట్టుకుంటే కనుక అప్పుడు మీరు అన్ని బాంధవ్యాలను, అన్ని సంబంధా లను తెగతెంపులు చేసుకున్నట్లే అవుతుంది. అప్పుడు మీరు - అంటే మీ అహం - అదే మహా ప్రధానమై పోతుంది. అదే తన చిత్ర విచిత్రమైన ప్రేరేపణలతో, బలీయమైన కోరికలతో, వ్యాపకాలతో అతి ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. మీకూ ప్రపంచానికీ మధ్య గల ఎడం ఇంకా పెరిగి, పెద్దదై పోతుంది. అంతులేని సంఘర్షణలలో మీరు మునిగి పోతారు.

నిజమైన సంక్షోభం

The Whole Movement of Life is Learning: Letters to the Schools, Ch. 70.

ఒకసారి మీ చుట్టూ చూసుకున్నట్లయితే, ఈ మానవ ప్రపంచం వైపు కాదు - ప్రకృతి వైపు, గగనతలం వైపు చూసుకున్నట్లయితే అద్భుతమైన ఒక క్రమశీలత, ఒక సమతుల్యత, ఒక సామరస్య భావం అక్కడ కనబడతాయి. ప్రతి ఒక్క చెట్టులోను, ప్రతి ఒక్క పూవులోను దానిదే అయిన ఒక క్రమత, ఒక సౌందర్యము ఉంటాయి. ప్రతి ఒక్క కొండ శిఖరానికి, ప్రతి ఒక్క కొండ లోయకు వాటికే చెందిన ఒక లయ, అచంచలత్వము ఉంటాయి. మానవుడు నదులను తన అదుపు ఆజ్ఞల్లో ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నా, కల్మషపరచాలని ప్రయత్నిస్తున్నా ఆ నదులు తమ ప్రవాహ వేగంతో తాము ప్రవహించి పోతునే ఉంటాయి. దూరాలను అందుకోవటానికి పోయే వాటి ప్రవాహగతి వాటికి ఉంటుంది. ఇది లేనిది మనిషిలోనే. సముద్రాలలో, గాలిలో, అపారంగా విస్తరించుకున్న ఆకాశ సీమల్లో ఒక అద్భుతమైన సుస్వచ్ఛత, క్రమత ఉన్నాయి. అవే వాటి అస్తిత్వం.

నిజమే, నక్క కోడిపిల్లను చంపుతుంది. పెద్ద జంతువులు చిన్న జంతువులను తిని బ్రతుకుతుంటాయి. ఇది మనకు క్రూరంగా కనబడినా ఇది ఈ మహావిశ్వంలో గల క్రమతా విధానం. ఇది మనిషిలో మాత్రమే లేదు. మనిషి కనుక జోక్యం చేసుకోకపోతే విశ్వంలో గొప్ప సమతుల్యత, గొప్ప సామరస్యము ఉంటాయి. అదే ఈ మహావిశ్వపు సౌందర్యం.

నిజమైన సంక్షోభం

IIT-Bombay,
7 February 1984;
Why are You being Educated?

అసలు ఈ సమస్త జీవన అస్తిత్వానికి వెనక గల అర్థం ఏమిటి? దీని వైపు పరికించి చూడటం మీకు ఇష్టం లేక పోవచ్చు. ఎలాగోలా ఈ ప్రశ్న నుండి తప్పించుకొనిపోవాలని మీరు అను కుంటున్నారేమో... భౌతిక శాస్త్రమో, భాషా శాస్త్రమో, జీవశాస్త్రమో, సామాజికశాస్త్రమో, తత్వశాస్త్రమో, మానసిక విశ్లేషణో, మానసిక చికిత్సా శాస్త్రమో - మొదలైన వాటిలో ఏదో ఒక విషయంలో ఉన్నత విజ్ఞానం, పాండిత్యం సంపాదించడానికి మీరు ఇరవై, ముప్ఫయి సంవత్సరాలు కృషి చేసి ఉండచ్చు. ఏళ్ళ తరబడి ఆ అంశాలను మీరు అధ్యయనం చేసి ఉండచ్చు. కానీ, మీరు ఏమిటో అది – ఆ దానిని మీ అంతట మీరే కనిపెట్టడానికి, మీరు ఎందుకు ఇలా జీవిస్తున్నారో అది మీ అంతట మీరే కనుగొనడానికి ఒక్క రోజు కాదు కదా చివరకు ఒక్క గంట కూడా వెచ్చించరు.

నిజమైన సంక్షోభం

Bombay,
10 February 1985;
That Benediction is Where You are.

మన జీవితాలను మనం వృధా చేసుకుంటున్నామా? వృథా అనే ఆ మాటకు అర్థం ఏమిటంటే మన శక్తిని అనేక రకాలుగా మనం వ్యర్థపరచుకుంటున్నాం అని. కొన్ని కొన్ని వృత్తుల్లో నిపుణులైపోయి అవే అనుసరిస్తూ మన శక్తిని వ్యర్థపరచు కుంటున్నాం అని. మన సమస్త అస్తిత్వాన్ని, మన సమస్త జీవితాన్ని ఈ విధంగా వృథాగా గడిపేస్తున్నామా? మీరు కనుక బాగా ధనవంతులయితే, 'అవును, నేను చాలా డబ్బు, సంపదలు కూడబెట్టుకున్నాను. నాకు చాలా సుఖంగా, సంతోషంగా ఉంది' అని అంటారు. లేదూ మీలో ఏదో ఒక ప్రతిభ కనుక ఉంటే ఆ ప్రతిభే మీ ఆధ్యాత్మిక జీవనానికి ప్రమాదకరం అవుతుంది. ప్రతిభ ఒక వరప్రసాదం వంటిది. అది ఒక కౌశలం. ప్రత్యేకమైన ఒక రంగంలో అభిరుచి, నేర్పు, నైపుణ్యం అంటే కూడా అదే. ఈ ప్రత్యేక నైపుణ్యాలు అన్నీ కూడా విచ్ఛిత్తిని కలిగించే అంటే మిమ్మల్ని ముక్కలు ముక్కలుగా విడదీసే ప్రక్రియలు. అందుచేత మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోవలసినది ఏమిటంటే - మీ జీవితాన్ని మీరు వృథా చేసుకుంటున్నారా? అని. మీ వద్ద చాలా ధనం ఉండవచ్చు, మీలో రకరకాలైన నైపుణ్యాలు ఉండవచ్చు, ఒక ప్రత్యేక విభాగంలో మీరు ప్రవీణులై ఉండచ్చు. గొప్ప శాస్త్రవేత్త అయియుండవచ్చు. గొప్ప వ్యాపార వేత్తలు అయియుండవచ్చు. అయితే జీవిత చరమాంకాన చూసుకుంటే అదంతా వట్టి వృథా యాతనే అని అనిపిస్తుంది కదూ?

Saanen, 22July, 1973

మీ సభ్యతా సంస్కృతులు ఏమంటా యంటే - "జీవితానికి గల అర్థం ఏమిటి అని అడిగి ఎందుకు తల పగలగొట్టుకుంటారు? ఊరికే జీవిస్తూ పోండి. అసహ్యాకరమైన ఈ వికృతత్వంతో, పాశవికమైన ఈ బ్రతుకుతో, ఈ దుఃఖాలతో, ఈ బాధలతో, ఆందోళనలతో, సుఖాలతో, భయాలతో, అంతూ పొంతూ లేని విసుగుదలతో, ఒంటరితనంతో బ్రతికేయండి. ఇవన్నీ మీ జీవితంలో భాగాలే. వీటిని మీరు దాటుకొని ఏనాటికీ పోలేరు. అందుచేత వీటినే ఆనందించండి. మీ జీవితంలో సుఖాలకే ప్రముఖ స్థానం ఇవ్వండి."

అందుచేత మీరు అక్షరాలా ఆ పనే చేస్తున్నారు.

నిజమైన సంక్షోభం

The Whole Movement of Life is Learning: Letters to Schools, Ch 28.

ప్రపంచంలో ఎక్కడైనా చూడండి. కొద్దిగానో ఎక్కువగానో దిగజారిపోవడం, క్షీణత మనుష్యుల్లో కనబడుతుంది. అది వ్యక్తిగతమైన సుఖం కాని, సమష్టి సుఖం కాని ఏదైనా సరే - అదే జీవితంలో అన్నింటి కంటె అతిముఖ్యమై పోయినప్పుడు - సెక్స్ సుఖం అవచ్చు, తన స్వంత ఇష్టాయిష్టాలను అందరిపై రుద్దడం అవచ్చు, తీవ్రంగా ఉద్రేకపరచే సుఖాలు అవచ్చు, స్వలాభం ఇచ్చే సౌఖ్యం అవచ్చు, అధికారమూ అంతస్తూల వల్ల కలిగే సుఖాలవచ్చు, తన సొంత సుఖసంతోషాలనే పూర్తిగా పొందాలి, తనివి తీర్చుకోవాలి, తృప్తి చెందాలి అనే ఎడతెగని కాంక్ష అవచ్చు - ఏదైనా సరే - అదే పతనానికి నిదర్శనం. బాధ్యత అనే అంశానికి పూర్తిగా అర్థం లేకుండా పోయినప్పుడు, ఇతరులను పట్టించుకోవడం అనేదే లేనప్పుడు, భూమిని గురించి గాని, సముద్ర ప్రాణులను గురించి కాని శ్రద్ధ చూపనప్పుడు - భూమ్యాకాశాలను ఈ విధంగా నిర్లక్ష్యంతో చూడటం మరొక విధమైన పతనం - దిగజారిపోవడం. ఉన్నత స్థాయిలలో కూడా కపటం ఉన్నప్పుడు, వర్తక వ్యాపారాల్లో నిజాయితీ లోపించినప్పుడు, దైనిక జీవితపు సంభాషణల్లో అబద్ధాలు ఒక భాగమైపోయి నప్పుడు, కొద్ది మంది అందరి పైన నిరంకుశత్వం చలాయిస్తున్నప్పుడు, వస్తువులకే ప్రాధాన్యం ఎక్కువైనప్పుడు - అప్పుడిక సమస్త జీవితానికి ద్రోహం జరిగిపోతుంది. అప్పుడిక చంపడం జీవితపు ఏకైక భాష అయిపోతుంది. ప్రేమను ఒక సుఖంగా తీసుకుంటుంటే అప్పుడిక జీవన సౌందర్యం నుండి, జీవితపు పవిత్రత నుండి మానవులు తమను తాము తెగతెంపులు చేసుకున్నట్లే.... .

మన జీవితాల్లో సుఖానికే పెద్ద పీట వేసి ఆధిక్యతను ఇచ్చినప్పుడు, ఈ ఉద్దేశ్యం పెట్టుకొని సంబంధ బాంధవ్యాలను స్వలాభం కోసం ఉపయోగించుకుంటుంటే కనుక - అప్పుడు మరొకరితో నిజమైన సంబంధ బాంధవ్యం ఉండనే ఉండదు. అప్పుడు సంబంధ బాంధవ్యాలు వ్యాపార వస్తువులై పోతాయి. సాఫల్యం పొందాలి అనే ఆ బలమైన ప్రేరణకు సుఖసౌఖ్యాలే ఆధారం. ఆ సుఖసౌఖ్యాలు లభించకపోతే, లేదా అవి వ్యక్తం చేసుకునే మార్గం లేకపోతే - అప్పుడిక కోపము, నిరాశావాదము, ద్వేషము, కచ్చదనము పుట్టుకొస్తాయి. సుఖసౌఖ్యాల కోసం ఈ ఎడతెగని లాలస, అంతులేని ప్రయాస నిజానికి ఉన్మాదమే కదూ.

నిజమైన సంక్షోభం

Bombay,
15 February 1948;
The Collected Works, Vol. IV.

ఎందుకని మనిషి ఇంద్రియ సంబంధమైన సుఖాల్లో చిక్కుకొని పోయాడు? ఇది మహా తీవ్రమైన సమస్యగా అయింది. ఎందుకంటే ఆధునిక సమాజంలో ఎటు చూసినా ప్రతి ఒక్క అంశము, ప్రతి ఒక్క సాధనము ఈ ఐంద్రియ సుఖాలను రెచ్చగొట్టేవిగానే ఉంటున్నాయి. వార్తా పత్రికలు, సినిమాలు, సచిత్రవార మాసపత్రికలు శృంగార భావాలను ఉద్రేకపరుస్తూండటం కనబడుతుంది. ప్రజల దృష్టిని బాగా ఆకట్టుకోవడానికి వ్యాపార ప్రకటనల్లో స్త్రీల బొమ్మలనే ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. బాహ్యమైన, ఆంతరికమైన ఉద్రేకాలను ప్రోత్సహించడం జరుగుతున్నది. అదే పనిగా ఆ రకమైన ఉద్రేకాలను రెచ్చగొట్టడం, పెంచి పోషించడం జరుగుతున్నది. ప్రస్తుతం ఉన్న సమాజం ఇలా ఏర్పడటానికి కారణం ప్రధానంగా ఏమిటంటే ఇంద్రియ సంబంధితమైన విలువలకు ప్రాముఖ్యత ఇవ్వడం. అందుకే వస్తువులు, అధికారము, అంతస్తు, పేరు, వర్గము ప్రాణం కంటే ఎక్కువ ముఖ్యమైపోయాయి. మీ జీవితాల్లో తక్కిన అన్నింటిని త్రోసి పారేసి ఐంద్రియ విలువలు అత్యధికమైన ప్రాధాన్యాన్ని సంతరించుకొని కూర్చున్నాయి. .... మీవి వట్టి డొల్ల జీవితాలు. అక్కడ ఉన్నది ఏమీ లేదు. పూర్తిగా ఖాళీ. రోజూ మీరు చేస్తున్నది ఏమిటయ్యా అంటే డబ్బు సంపాదించడం. చీట్ల పేక ఆడటం, సినిమాలు చూడటం, పుస్తకాలు చదవడం. ప్రతి రోజూ మళ్లీ మళ్లీ ఇవే చేస్తుంటారు.

*Varanasi,
22 January 1954;
Leaving School,
Entering Life.*

బాగా డబ్బు గలవారు నైట్ క్లబ్బులో, వినోదాల్లో పడి తమను తామే మర్చిపోవాలనుకుంటారు. లేదా కార్లలో ఎక్కి తిరుగుతుంటారు. ప్రయాణాలు చేస్తారు. చాతుర్యం, గడుసుదనం ఉన్నవారు తమను తాము మరచిపోవడానికి ఏవో కొత్తవి కనిపెట్టడం, తయారు చేయడంలో మునిగిపోతుంటారు. కొందరు అంతకు ముందు కనీ వినీ ఎరగని నమ్మకాల్లో పడతారు. మూర్ఖులు కూడా తమను తాము మరచిపోవాలనుకుంటారు. అందుకని ఎవరో ఒకరిని అనుసరించడం మొదలెడతారు. గురువులను ఆశ్రయిస్తారు. వీళ్ళు ఏం చేయవలసిందీ ఆ గురువులు ఆదేశిస్తారు. వీళ్ళు తూచ తప్పకుండా ఆచరిస్తారు. ఆకాంక్షపరులు కూడా ఏదో ఒకటి చేసి తమను తాము మరచిపోవాలనుకుంటారు. అందుచేత మనందరమూ కూడా వయసు పెరుగుతున్నకొద్దీ, పరిణతి పొందుతున్న కొద్దీ మనల్ని మనం మరచిపోవాలని అనుకుంటాం.

Commentaries on Living, Ch:3

స్థిమితం లేని మనసుకు రకరకాలైన పనులు కావాలి, అవీ ఇవీ ఎన్నో చేపడుతుంది. మాటల్లో, చేతల్లో పలు పలు రకాలుగా పైకి అభివ్యక్తమవాలని ఆ మనసు అనుకుంటుంది. ఏదో ఒకదానితో మనసును నింపుకోవాలి. ఏదో ఒక వ్యాపకంలో పడితీరాలి అనుకుంటారు చాలా మంది. ఇంద్రియాలను సంచలనపరిచేవి ఇంకా ఎక్కువెక్కువగా కావాలి అని కోరుకుంటూ అనేక రకాలైన అభిరుచులు అలవరచుకోవడం, వదిలేయడం చేస్తుంటారు. పిచ్చాపాటీ కబుర్లలో ఇవన్నీ లభిస్తాయి. చాలా మందికి ఇతరుల వ్యవహారాల్లో మహా ఆసక్తి ఉంటుంది. ఇక వాటిలోనే మునిగి కాలం గడిపేస్తుంటారు. ఇతరులను గురించి ఈ కుతూహలం కారణంగానే లెక్కలేనన్ని వార, మాస పత్రికలు, దిన పత్రికలు చదువుతుంటారు. ఆ పత్రికల్లో ప్రముఖులను గురించి రాసే ఊసుపోని కబుర్లు చదువుతుంటారు. ఆ పిచ్చాపాటీ కబుర్ల పుటల్లోని హత్యలు, విడాకులు మొదలైన కథనాలను ఎంతో ఆసక్తితో చదువుతుంటారు. ఈ రకంగా మనం బాహ్యగతమైన విషయాల్లోనే మునిగిపోవడం ఎక్కువై పోతూ ఉంటుంది. అంతర్గతంగా ఖాళీగా ఉండిపోతాం. బయటి విషయాలతో ఉండిపోతున్న కొద్దీ ఇంద్రియాలను సంచలనపరిచేవి ఇంకా ఎక్కువెక్కువగా మనకు కావాలి. వ్యాపకాలు కొత్త కొత్తవి కావాలి. ఇటువంటి కృతకమైన కార్యకలాపాలను, అర్థంలేని వ్యాపకాలను ఆధునిక జీవన రీతి ప్రోత్సహిస్తూ ఉంటుంది.

నిజమైన సంక్షోభం

Krishnamurti to Himself,
18 March, 1983

భవిష్యత్తు గురించి మనకు అంతగా శ్రద్ధ ఉన్నట్లు కనిపించదు. టెలివిజన్ ముందు కూర్చుని పొద్దున లేచిన దగ్గర్నుండి అర్ధరాత్రి వరకు ఏవో కార్యక్రమాలు అంతులేకుండా చూస్తూ మీరు కాలక్షేపం చేస్తుంటారు.
పిల్లలకు కూడా ఇదే కాలక్షేపం. వ్యాపార ప్రకటనలు అన్నీ కూడా మీకేదో మంచి వినోద కార్యక్రమాలు అందిస్తున్నాయని మీరు భావించే విధంగా తయారు చేయబడుతున్నాయి. ప్రపంచమంతటా కూడా ఇదే జరుగుతున్నది. ఇవి చూస్తున్న చిన్న పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుంది? క్రీడారంగం కూడా కాలక్షేపపు కార్యక్రమాలు అందిస్తున్నది. కొద్ది మంది బరి మీద ఆట ఆడుతుంటే ముప్ఫయి లేక నలభై వేల మంది ప్రేక్షకులు చూస్తుంటారు. గొంతులు బొంగురుపోయేలా అరుస్తూ కేకలు పెడుతుంటారు..... ఈ ప్రపంచంలో నలుమూలలా పర్యటిస్తున్నప్పుడు, వివిధ ప్రదేశాల్లో ఇదే జరుగుతుండటం చూస్తున్నప్పుడు, ఈ రకంగా వినోదాలతో, కాలక్షేపాలతో, ఆటలతో మనసు నిండిపోయి ఉండటం చూస్తున్నప్పుడు ప్రపంచం గురించి ఏమాత్రం పట్టించుకునే వారైనా మనిషి భవిష్యత్తు ఏమిటి అనే ప్రశ్న వేసుకోకుండా ఉండరు. ఇప్పుడున్నదే ఇంకా ఎక్కువవుతుందా? భిన్న భిన్న రూపాల్లో కొనసాగుతుందా? వినోద కార్యక్రమాలు వైవిధ్యభరితంగా ఉండి ఇంకా ఎక్కువవుతాయా?

వినోద కాలక్షేపాల వ్యాపారం అన్నింటినీ హస్తగతం చేసుకున్నప్పుడు, ప్రస్తుతం క్రమక్రమంగా జరుగుతున్నది అదే - అప్పుడు యువతీయువకులు, విద్యార్థులు, చిన్నపిల్లలు నిరంతరం సుఖాల వైపుగా, సరదాల వైపుగా, ప్రణయ శృంగారాల వైపుగా ప్రేరేపించబడుతూ, రెచ్చగొట్టబడుతూ ఉంటారు. అప్పుడు సంయమనం. నిరాడంబరత అనే మాటల్ని కూడా నెట్టి అవతల పారేయడం జరుగుతుంది. వాటి గురించి ఒక్క క్షణం కూడా ఆలోచన వెచ్చించరు...
నిరాండబరత అంటే దానిలో అంతర్లీనంగా ఉండేవి ఏమిటి అని వివరిస్తుంటే మీరు బహుశ చెవులు మూసుకుంటారు. బాల్యం నుండి మిమ్మల్ని మీరు వినోదపరచుకుంటూ ఉండాలని, కాలక్షేపాల కార్యక్రమాల ద్వారా మీ నుండి మీరు తప్పించుకొని తిరగాలని నేర్పిస్తూ మిమ్మల్ని పెంచి ఉంటారు. మానసిక శాస్త్రవేత్తలు చాలా మంది మీలో ఏ మనోభావాలు కలిగినా అవి పైకి వ్యక్తపరచాలని, ఏ రకంగా గానీ వాటిని లోపల దాచడం, అదుపులో పెట్టడము చేస్తే హానికరమనీ, ప్రమాదభూయిష్టమనీ అంటున్నారు. అంటే అలా అదుపు చేయడం మానసిక వైకల్యాలకు దారి తీస్తుందని అంటున్నారు. అందుచేత సహజంగానే మీరు క్రీడా ప్రపంచంలోనో, వినోదాల ప్రపంచంలోనో, కాలక్షేపాల ప్రపంచంలోనో అడుగుపెట్టడం, కాలం గడపడం ఇంకా ఎక్కువవుతుంది. ఇవన్నీ కూడా మీరు ఏమిటో ఆ దాని నుండి మీరు తప్పించుకొని పారిపోవడానికి తోడ్పడుతున్నాయి.

నిజమైన సంక్షోభం

Saanen, 21 July 1981; The Network of Thought.

రొబోల తయారీ వృద్ధి చెందాక, అప్పుడు మనిషికి బహుశ రోజూ రెండు గంటల సేపు మాత్రమే పని ఉంటుంది. త్వరలోనే మన కళ్ళ ముందే ఇది జరిగినా జరగచ్చు. అప్పుడు మనిషి ఏం చేస్తాడు? పూర్తిగా వినోద కాలక్షేపాల్లో మునిగిపోతాడా?... లేదా మనిషి అంతర్ముఖుడవుతాడా? అంతర్ముఖంగా వెళ్ళడం వినోద కార్యక్రమం మాత్రం కానే కాదు. అంతర్ముఖంగా మళ్ళాలంటే అత్యంతమైన పరిశీలనాశక్తి, పరీక్షించే శక్తి, అవ్యక్తిగతమైన అంటే తనకు (నాకు) చెందని గ్రహణశీలత ఉండి తీరాలి. రొబోలు వచ్చాక ఈ రెండు రకాలుగా జరిగే అవకాశం ఉన్నది.

నిజమైన సంక్షోభం

The World Within, Ch:75.

మీ సామర్థ్యాలను, పుట్టుకతో వచ్చిన మీ ప్రతిభా సంపదను మీ చుట్టూ కవచంలా చుట్టుకొని కూర్చుంటారు మీరు. అయితే అవే మీకు ఆపదలను తెచ్చి పెట్టే మిత్రులు. అవే మీ సమస్త జీవితంగా అయిపోతాయి. కానీ అవే మీకు దుర్భరమైన దురవస్థలను, వ్యధను, దుఃఖాన్ని తెచ్చి పెడతాయి. మీ ఆహారం, మీ దుస్తులు, మీ వేషభాషలు, మీ సుఖసంతోషాలూ - అవే మీకు విసుగు కలిగిస్తాయి. మిమ్మల్ని మందకొడిగా చేసి నిస్సత్తువలో పడేస్తాయి. మీ మనసు సున్నితశీలత కోల్పోతుంది. త్వరగా అర్థం చేసుకునే చురుకుదనం మనసుకు తగ్గిపోతుంది. ఉపరితల మానసంలో జరిగే ఈ కార్యకలాపాల ఎరుక కనుక మీకు కలిగితే, మనసులో పై పైనగా జరిగే ఈ వాగుడు, ఈ నటనలు, నాట్యాలు, తర్కాలు, నిర్ణయాలు, అభిప్రాయాల ఎడల ఎరుక కలిగితే, అప్పుడా ఎరుక ద్వారానే ప్రశాంతి, ప్రస్ఫుటత్వం నెలకొంటాయి. సుస్పష్టత, అవగాహన కావాలంటే బాగా గాఢమైన లోతులలో అలజడి కలగడం చాలా అవసరం.

*Poona,
19 September 1948;
The Collected
Works, Vol. V.*

అందుచేత, అన్నింటి కంటే ప్రధానమైన సంగతి ఏమిటంటే .... స్వీయ జ్ఞానం. తనను తాను అర్థం చేసుకోకుండా ఈ ప్రపంచంలో క్రమత తీసుకొని రావడం సాధ్యమవదు. మనలో ఉన్న మన ఆలోచనలు, మనోభావాలు, భావస్పందనలు, మన చర్యలు అనే ఆ మొత్తం ప్రక్రియను శోధించకపోతే ప్రపంచ శాంతి, క్రమశీలత, భద్రత అనేవి ఈ ప్రపంచంలో నెలకొల్పడం సాధ్యమవదు. అందుచేత తనను తాను అధ్యయనం చేయడం అత్యంత ప్రధానమైన ప్రాథమిక అవసరం. ఈ అధ్యయనం తప్పించుకొని పారిపోయే ప్రక్రియ కాదు.

తనను తాను అధ్యయనం చేయడం వట్టి నిష్క్రియ కాదు. ఏమీ చేయకపోవడం కాదు. కాకపోగా దీనికి మనం చేస్తున్న ప్రతి ఒక్క దాని ఎడల అత్యంతమైన ఎరుక కలిగి ఉండటం తప్పనిసరిగా కావాలి. అది ఎటువంటి ఎరుక అంటే ఆ ఎరుకలో తప్పొప్పుల తీర్పు ఉండదు. దూషణ గాని ఖండన గాని ఉండవు. మన నిత్య జీవితం గడుపుతున్నప్పుడు ఉండవలసిన ఈ ఎరుక - తను అనే ఆ సమస్త ప్రక్రియ ఎడల ఎరుక ఉండటం మనల్ని సంకుచితపరచుకోవడం కానే కాదు. కాకపోగా అది నిరంతరమూ విస్తరిస్తూ పోతుంది. నిరంతరమూ సుస్పష్టపరుస్తూ ఉంటుంది. ఇటువంటి ఎరుకలో నుండి క్రమశీలత జనిస్తుంది. మొదట ఈ క్రమత తనలో కలుగుతుంది. ఆ పైన బాహ్యంగా తనకు గల సంబంధ బాంధవ్యాలలో నెలకొంటుంది.

నిజమైన సంక్షోభం

Montevideo, 26 June 1935; The Collected Works, Vol. II.

మీ జీవితంలో ఏ బాధలూ లేకపోతే, సంఘర్షణ ఏదీ లేనట్లయితే, అసలు మీ జీవితంలో ఏ సమస్యలూ లేకపోతే కనుక, విపత్కరమైన పరిస్థితులు ఏవీ ఎదుర్కోవలసిన అవసరం లేకపోతే అప్పుడు ఇక మీకు చెప్పవలసినది ఏమీ లేదు. అంటే ఏమిటంటే, మీరు నిద్రలో మునిగిపుంటే ముందుగా జీవితపు చర్య మిమ్మల్ని మేలుకొల్పాలి. కానీ ఏవైనా బాధలు మొదలవగానే సాధారణంగా మీరు ఏం చేస్తారు? ఏం జరుగుతుంది? ఆ బాధలను తగ్గించే ఉపశమనం కోసం వెంటనే వెతుక్కోవడం ఆరంభిస్తారు. ఇలా మీకు ఓదార్పు నిచ్చే దానిని వెతికి పట్టుకోవడంలోనే క్రమక్రమంగా మళ్ళీ మీరు నిద్రలోకి జారుకుంటారు. మీరు పడే ప్రయాసే మిమ్మల్ని తిరిగి నిద్ర బుచ్చేస్తుంది. ఏదైనా ఆఘాతం తగిలి - ఈ ఆఘాతాన్నే మీరు బాధ అని అంటారు. ఆ ఆఘాతం మిమ్మల్ని నిద్రనుండి మేలుకొలిపినప్పుడు - అదే సరియైన క్షణం. ఆ క్షణమే - బాధకు ఓదార్పునో ఉపశమనాన్నో కోరుకోకుండా - బాధలకు గల కారణాన్ని అన్వేషించే నిజమైన తరుణం.

*Ojai,
18 June 1934;
The Collected
Works, Vol. II.*

సంఘర్షణ గురించిన స్పృహ కనుక మీలో లేకపోతే - అంటే మీ స్వీయానికి పరిసరాలకు మధ్య జరుగుతన్న యుద్ధం గురించి, ఆ ఒక యుద్ధం జరుగుతున్నదనే స్పృహ మీకు లేకపోతే అప్పుడిక ఆ యుద్ధాన్ని నివారించే ఉపాయాల కోసం, ఉపశమనాల కోసం మీరు వెతకడం ఎందుకు? స్పృహరహితంగానే అలాగే ఉండి పోండి. పరిస్థితులు తమంత తామే ఆ సంఘర్షణను పుట్టించనివ్వండి. దాని కోసం మీరు పరుగెత్తకండి. అలా పరుగెత్తి నిజంగా లేని సంఘర్షణను, మీ మనసులో హృదయంలో లేని సంఘర్షణను కృత్రిమంగా తయారు చేసి అక్కడ పెట్టకండి. కృత్రిమమైన సంఘర్షణను మీరు ఎందుకు సృష్టిస్తారంటే ఏదో లోపించిందని మీకు అనిపించి ఉంటుంది. మీకు లేదు అనే ఏదో లోటును చూసి మీరు భయపడుతున్నారు కాబట్టి. అయితే జీవితం మిమ్మల్ని వదలదు. ఆ లోటు లేకుండా చేస్తుంది.

నిజమైన సంక్షోభం

Varanasi,
16 December 1952;
The Collected Works, Vol. VII.

తలుపులు కిటికీలు అన్నీ మూసేసుకొని మీరు లోపలే ఉండిపోతే సురక్షితంగా, భద్రంగా అనిపిస్తుంది మీకు. ఎవ్వరూ మిమ్మల్ని తాకలేరు అనుకుంటారు. అయితే జీవితం అలా ఉండదు. జీవితం మీ తలుపు కొడుతూనే ఉంటుంది. వదలకుండా ఎప్పుడూ కొడుతూనే ఉంటుంది. కిటికీ తలుపులు తోసి పడేసి తెరవాలని నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఎన్నో, మరెన్నో మీకు చూపాలని జీవితం అలా చేస్తుంటుంది. మీరు భయపడుతుంటే, తలుపులు - కిటికీలు మూసుకొని కూర్చుంటే ఇంకా గట్టిగా తలుపులు మోదడం, నెట్టడం ఎక్కువవుతుంది. అందుచేత, బాహ్యగతమైన రక్షణలను, భద్రతలను మీరు ఎక్కువ చేసుకొని, వాటిని గట్టిగా పట్టుకొని కూర్చున్న కొద్దీ జీవితం ఇంకా ఇంకా తోసుకుంటూ వచ్చి మీ పైన పడుతుంది.

నిజమైన సంక్షోభం

Madras, 29 December 1979; The Seed of a Million Years.

సరే, మిమ్మల్ని ఏది మార్చగలుగుతుంది? ఒక పెను సంక్షోభమా? మీ తలకాయ మీద గట్టిగా దెబ్బ తగిలితే అప్పుడు మార్పు వస్తుందా? దుఃఖమా? కన్నీళ్ళా ? అవన్నీ జరిగాయి. ఎన్నో సంక్షోభాలు వచ్చాయి. వరసగా. అంతులేని కన్నీరు కడవల కొద్దీ మీరు కార్చారు. కానీ ఏదీ కూడా మీలో మార్పు తెచ్చినట్లు కనబడదు. ఎందుకంటే ఎవరో మీలో ఆ మార్పు తేవాలని, ఎవరో ఆ పని చేయాలని, ఆ ఎవరో మరొకరి పైన మీరు ఆధారపడుతున్నారు. 'నా అంతట నేనే కనిపెడతాను' అని మాత్రం ఎవ్వరూ అనడం లేదు.



నిజమైన సంక్షోభం

Bombay,
14 December 1969.

మీ ఈ జీవితాన్ని మీరు ఏం చేసుకున్నారు? ఈ జీవితం మీకు ప్రసాదించబడింది. జీవితం అని పిలవబడుతున్న ఈ మహా అద్భుతమైనది మీకు లభించింది. ఈ జీవితంలో దుఃఖాలు, సుఖాలు, భయాలు, అపరాధభావం ఉన్నాయి. జీవితంలో ఉండే చిత్రహింసలన్నీ ఉన్నాయి. జీవితంలో ఉండేటటువంటి ఆ ఒంటరితనము, ఆ నిరాశానిస్పృహలూ ఉన్నాయి. వీటితో పాటు జీవన సౌందర్యమూ ఉన్నది. అవన్నీ మీరు చూశారు. అటువంటి జీవితాన్ని మీరు ఏం చేశారు? ఈ ప్రశ్న వేసుకొని, ఇక శోకం భరించలేక వెళ్ళి మంచం ఎక్కకండి. ఎందుకంటే మీరు చేసినది ఏమీ లేదు. బొత్తిగా ఏమీ చేయలేదు. మీకు ఒక జీవితాన్ని ప్రసాదించారు. లోకంలో కల్లా అత్యంత విలువైన అమూల్యమైన అంశం ఆ జీవితం. అప్పుడు మీరు ఏం చేశారు? ఆ జీవితాన్ని పట్టుకొని వికృతంగా తయారు చేశారు. చిత్రవధలు చేశారు. జీవితాన్ని ముక్కలు ముక్కలుగా చించి పారేశారు. కత్తిరించి విభజించారు. హింసను, విధ్వంసాన్ని, విద్వేషాలను తెచ్చి పెట్టారు. ప్రేమ లేకుండా చేసుకున్నారు. దేని పైన కారుణ్యం లేదు. దేని గురించి గాఢోద్వేగం లేదు. అందుచేత, మీ జీవితంతో మీరు ఏం చేశారు అనే ప్రశ్న వేసుకున్నప్పుడు మీ కన్నులు కన్నీటిని వర్షించకుండా ఉండలేవు. కానీ కన్నీరు ఎందుకు ప్రవిస్తుందంటే, దానికి కారణం ఏమిటంటే మీరు గతం గురించి ఆలోచిస్తున్నారు కాబట్టి. మీరు ఏం చేసి ఉండి ఉండచ్చు అని చింతిస్తున్నారు కాబట్టి. ఆ కన్నీరు మీపై మీకే జాలి పుట్టి కారుస్తున్న కన్నీరు

నిజమైన సంక్షోభం

Ojai,
17 June 1945;
The Collected Works, Vol. IV.

సంతోషము, నవ్వుతూ ఉండటము - ఇవి కాదు సాధించవలసిన లక్ష్యాలు. సాహసం లాగే, ఆశలాగే ఇవీ కొన్ని సంఘటనలు. అంతే. అన్వేషణే గమ్యం అయినటువంటి అన్వేషణలో ఇవి జరుగుతూ ఉంటాయి. ఎంతో సహనంతో, వదలని దీక్షతో ఆ అసలైన గమ్యం కోసం వెతుక్కుంటూ పోవాలి. ఆ గమ్యాన్ని - ఆ లక్ష్యాన్ని కనిపెట్టినప్పుడు మాత్రమే మన లోపలి ఆ తీవ్రమైన అలజడి, అంతర వ్యధ అంతరిస్తాయి. ఆ గమ్యాన్ని కని పెట్టడానికి జరిగే ప్రయాణం మనలో నుండే ఉంటుంది. ఇక తక్కిన ఏ ప్రయాణాలైనా సరే అవి అర్థహీనమైన అనవసర వ్యాపకాలే. అవి అన్నీ అజ్ఞానం వైపుగా అపభ్రమల వైపుగా మాత్రమే తీసుకెళతాయి. మన లోపలగా మనం చేపట్టే ఈ ప్రయాణం ఒక ఫలితాన్ని ఆశించేది కాకూడదు. సంఘర్షణకు, దుఃఖానికి పరిష్కారం కోసం కాదు. ఎందుకంటే ఈ అన్వేషణా ప్రయాణమే అంకిత భావము, అంతఃస్ఫూర్తి.

Think on These Things, Ch:26.

మనిషి చేయవలసిన సత్ కార్యం ఏమిటి? నిస్సందేహంగా మనిషి చేయవలసిన పని నిజంగా ఏమిటంటే సత్యాన్ని కనిపెట్టడం. దైవాన్ని ఆవిష్కరించుకోవడం. అతడు చేయవలసినది ప్రేమించడం. అంతే తప్ప తన స్వార్థ ప్రయోజనం కోసం చేసే రకరకాల కార్యక్రమాలు కాదు. సత్యం ఏమిటి అనేది ఆవిష్కరించడంలోనే ప్రేమ ఉంటుంది. మనిషికీ మనిషికీ మధ్య సంబంధ బాంధవ్యాలలో గల ఈ ప్రేమ ఒక విభిన్నమైన నాగరికతను నిర్మిస్తుంది. ఒక నవ్య ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

నిజమైన సంక్షోభం

Think on These Things, Ch:17.

మానవులం అందరమూ ఒకటే. అంతా ఒకే మానవాళి. ఈ భూమి మనది. అందరమూ కలిసి పంచుకోవాలి. ఈ భూమిని ప్రేమతో సంరక్షించుకుంటే అందరికీ సరిపోయేంత ఆహారాన్ని, కట్టుకోవడానికి వస్త్రాలను, ఉండటానికి నివాసాలను ఇస్తుంది. కాబట్టి విద్యాబోధన చేయవలసిన పని ఏమిటంటే ఏవో కొన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులవడానికి మిమ్మల్ని సంసిద్ధం చేయడం కాదు. ఈ జీవితం అనే సమస్త సమస్యను మీరు సంపూర్ణంగా అర్థం చేసుకోవడంలో మీకు తోడ్పడాలి... దైవం అంటే ఏమిటి అని తెలుసుకోవడం గూడా మనకు గల ఒక ముఖ్య సమస్య. ఎందుకంటే అదే మన జీవితాలకు నిజమైన పునాది. సవ్యమైన పునాది లేకపోతే ఏ ఇల్లు అయినా దీర్ఘకాలం పాటు నిలబడలేదు. దైవం అంటే ఏమిటి, సత్యం అంటే ఏమిటి అనేది కనుక మనం అన్వేషించనట్లయితే మానవుడు అతితెలివితో, వక్రబుద్ధితో కనిపెట్టిన అనేకమైన ఈ నూతన ఆవిష్కరణలు అన్నీ నిరర్థకమైన పనులు.

ఈ పనులన్నీ విధ్వంసానికి, దారుణ నికృష్టతకు దారి తీస్తుండటం మీకే కనబడుతుంది. అల్లకల్లోలానికి, దిక్కు దారీ తోచని దురవస్థలకు దారి తీస్తున్నాయి. ఒక పక్కన గొప్ప సుఖసౌకర్యాలలో మునిగి తేలే అతి విలాసవంతమైన జీవితాలు, మరో పక్కన పరమ దారిద్ర్యం, రోగాలు, ఆకలి బాధలు. వీటి ఎదురుగా రిఫ్రిజిరేటర్లు, జెట్ విమానాలు. ఇదంతా మనిషి చేసిన నిర్వాకం. ఇదంతా చూసినప్పుడు మిమ్మల్ని మీరే ఇలా ప్రశ్నించుకోకుండా ఉంటారా? 'ఇదేనా మనిషి సాధించింది? ఇంతేనా? మనిషి చేసిన సత్కార్యాలు ఇంకేమీ లేవా?' అసలు మనిషి చేయవలసిన సత్ కార్యం, సత్ ధర్మం ఏమిటి అనేది మనం కనిపెట్టగలిగితే అప్పుడు ఈ జెట్ విమానాలకు, వాషింగ్ మెషిన్లకు, వంతెనలకు, వారధులకు, వసతి గృహాలకు అర్థం పూర్తిగా మరోలా ఉంటుంది. అందుచేత మనిషి చేయవలసిన కర్తవ్యం, సత్ ధర్మం ఏమిటి అనేది కనిపెట్టకుండా కేవలం కొన్ని సంస్కరణలు చేసి తృప్తిపడటం, ఇప్పటి వరకు చేసిన వాటిలో కొద్ది మార్పులు చేసి మరో రకంగా రూపుదిద్దడమూ వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. అన్నీ కూడా వట్టి నిరర్థకమైన పనులు.

నిజమైన సంక్షోభం

Think on These Things, Ch:11.

ఏది సత్యం అనేది కనుగొనాలని, దైవం అంటే ఏమిటి అని కనుగొనాలని మనలో కలిగే అంతఃప్రేరణ ఒక్కటి మాత్రమే నిజమైన ప్రేరణ. తక్కిన ప్రేరణలు అన్నీ రెండో తరగతివే. అవి అంత ముఖ్యం కాదు. నిశ్చలంగా ఉన్న నీటిలోకి ఒక రాయి విసిరితే కనుక నీరు కదిలి చక్రాలు చక్రాలుగా విస్తరించుకుంటూ పోతుంది. ఈ విస్తరించుకుంటూ పోయే చక్రాలు - ఈ వృత్తాకారాలు అప్రధానమైన రెండవ స్థాయి కదలికలు. ప్రధానమైన, నిజమైన కదలిక - చలనం కేంద్రంలో ఉంటుంది. ఈ చలనమే ఆనందాన్ని, దైవాన్ని, సత్యాన్ని కనుగొనడానికి జరిగే కదలిక, చలనశీలత. అయితే, మీరు భయంలో చిక్కుకొనిపోయి ఉన్నంత వరకు, బెదిరింపులకు బందీ అయి ఉన్నంతవరకు వాటిని కనిపెట్టలేరు. ఏ క్షణాన భయము, బెదిరింపు ఆరంభమవుతాయో ఇక అప్పటి నుండి సభ్యతా సంస్కృతులు పతనమైపోతాయి.

అందుచేత, మీరు చిన్న వయసులో ఉన్నప్పుడు నిబద్ధతలకు లోను కాకూడదు. మీ తల్లిదండ్రులంటే ఉండే భయంలో, మీ సమాజం పట్ల గల భయంలో కట్టుబడిపోయి ఉండకూడదు. అలా ఉండనప్పుడే సత్యం ఏదో అది కనిపెట్టాలనే ఆ కాలరహితమైన కదలిక, చలనం ఉంటుంది. సత్యం ఏమిటి అని అన్వేషించేవారు మాత్రమే, దైవం ఏమిటి అని అన్వేషించేవారు మాత్రమే - అటువంటి మానవులు మాత్రమే ఒక నవ్య నాగరికతను, ఒక నవ్య సంస్కృతిని సృష్టించగలుగుతారు.

నిజమైన సంక్షోభం

Think on These Things, Ch:27.

నిజంగా ధర్మయుతుడైన మనిషి సంస్కరణల గురించి పట్టించుకోడు. కేవలం సామాజిక వ్యవస్థలో మాత్రమే మార్పులను తేవడం గురించి చింతించడు. ధర్మయుతుడైన మనిషి సత్యం ఏమిటి అనే దానిని గురించి అన్వేషిస్తుంటాడు. ఆ అన్వేషణే సమాజం పైన ప్రభావం చూపుతుంది. సమాజంలో పరివర్తన రావడంలో దోహదపడుతుంది. ఈ కారణంగా, విద్యాబోధన ప్రధానంగా చేపట్టవలసిన కర్తవ్యం ఏమిటంటే సత్యాన్ని లేక దైవాన్ని అన్వేషించడంలో విద్యార్థికి సహాయపడటం. అంతేకాని, ఇప్పుడున్న సమాజపు విధానంలో, ఈ నమూనాలో విద్యార్థి ఇమిడి పోవడం కోసం అతడిని సిద్ధపరచడం కాదు.

*Saanen,
3 August 1975.*

శాశ్వతమైన పవిత్రత కలదీ, ఏనాటికీ కలుషితపరచలేనిదీ ఏదో ఆ దానిని మనం కనుగొనాలి. కరుణాత్మకత ఉంటేనే అది జరుగుతుంది. అంటే అర్థం - బాధలో ఉన్న సమస్తమైన సంపూర్ణ అంతరార్థాన్ని అవగాహన చేసుకున్నప్పుడు కరుణాత్మకత ఉంటుంది. అంటే మీ ఒక్కరి బాధే కాదు, ప్రపంచంలో ఉన్న బాధ సమస్తాన్నీ అర్థం చేసుకోవడం. ప్రపంచంలో ఉన్న బాధ సత్యం. అది ఉన్న మాట నిజం. అది మనోద్వేగాన్ని కలిగించి కలవరపరిచే ఆలోచన కాదు. ఆలోచన చిత్రణ చేసిన కాల్పనిక ఊహాభావాలు కాదు. వాస్తవంగా, నిజంగా బాధ ఉన్నది. మనలో ఉన్నది కదా, అలాగే. ఆ బాధతో జీవించాలి. అంటే, ఆ బాధ నుండి తప్పించుకొని వెళ్ళిపోకుండా దానితో పాటే ఉండాలి. తప్పించుకొని పోకుండా దానితో పాటే ఉంటే దానిని ఆ బాధను ముఖాముఖంగా ఎదుర్కొనే బ్రహ్మాండమైన శక్తి కలుగుతుంది. అప్పుడు మాత్రమే బాధకు అతీతంగా మీరు వెళ్ళిపోగలుగుతారు...

బాధకు గల సంపూర్ణ అర్థాన్ని మీరు అవగాహన చేసుకున్నప్పుడు మాత్రమే కరుణాత్మకత కలుగుతుంది. ఇక మీరు బాధపడటం అంతమై పోతుంది. కరుణాత్మకత గల మనసు మాత్రమే ధ్యానించ కలుగుతుంది. శాశ్వతంగా ఉండే పవిత్రతను కనిపెట్టగలుగుతుంది.

Think on These Things, Ch:17.

దైవం కోసం అన్వేషణ, సత్యాన్వేషణ, సంపూర్ణమైన మంచితనంతో ఉన్నటువంటి భావం - దీని అర్థం మంచితనాన్ని, నమ్రతను అలవరచుకోవాలి అని కాదు - మనసు కల్పన చేసుకున్న వాటికి, మనసు పన్నే మాయోపాయాలకు ఆవలగా, అతీతంగా ఉండే ఆ ఒక దాని కొరకు అన్వేషించడం. అంటే ఏమిటంటే ఆ ఒకదాని గురించి అనుస్పందన కలిగి ఉండటం. ఆ దానిలోనే జీవించడం, అదే అయిపోవడం. నిజమైన మతధర్మం అంటే ఇదీ. అయితే అలా మీరు ఎప్పుడు చేయగలుగుతారంటే – మీ కోసం మీరు త్రవ్వుకున్న ఆ నీటిగుంటను వదిలేసి జీవిత నదీ ప్రవాహంలోకి మీరు ప్రవేశించినప్పుడు మాత్రమే అలా చేయగలుగుతారు. అప్పుడు మహా ఆశ్చర్యం గొలిపే తీరులో జీవితమే మీ సంరక్షణను చూసుకుంటుంది. ఎందుకంటే అప్పుడు మీ గురించి మీరు పట్టించుకోవడం ఉండదు. జీవితం తన ఇచ్చవచ్చినట్లు తనతో మిమ్మల్ని తీసుకొని వెళుతుంది. ఎందుకంటే ఇప్పుడు మీరు ఆ జీవ ప్రవాహంలో భాగమైపోయారు. అప్పుడిక భద్రత, అభద్రత అనే సమస్యే ఉండదు. ఇతరులు ఏమంటారు, ఏమి అనడం లేదు అనే సమస్యే ఉండదు. అదే జీవన సౌందర్యం.

నిజమైన సంక్షోభం

The World Within,
Ch.76.

యథార్థతత్వాన్ని అన్వేషిస్తుంటే ఆహారం దానంతట అదే మీకు అందుతుంది. కానీ మనం కనుక ఆహారం కోసం మాత్రమే వెతుక్కుంటే ఆ ఆహారమే దొరక్కుండా పోతుంది. చివరి గమ్యం, పరమ విలువ ఆహారం కాదు. ఆహారాన్ని కనుక మన అంతిమ లక్ష్యంగా చేసుకుంటే ఆపదల పాలన బడతాం. హత్యలు జరుగుతాయి. తిండి లేక మాడవలసి వస్తుంది. క్షణికమైన వాటిలో నుండి శాశ్వతమైన దానికోసం అన్వేషించండి. అది చేరడానికి ఒక మార్గం లేదు. ఎందుకంటే అది ఎప్పుడూ ఇక్కడే ఉంటుంది.

The World Within,
Ch:19.

ఉన్నది ఒక యథార్థతత్వం మాత్రమే. అది పరమోన్నతమైనది, అద్వితీయమైనది. ఉన్నది ఒకే మానవాళి. ఒకే సత్ ధర్మం. అది సిద్ధించాలంటే అది చేరుకోవాలంటే వేరే ఏ మార్గమూ లేదు. వేరే ఎవరి ద్వారానూ చేరుకోలేము. మీ ద్వారానే చేరుకోగలుగుతారు. మీ విడుదల కొరకే మీరు అన్వేషించండి. అప్పుడు మీరు ఈ ప్రపంచాన్ని ఈ ప్రపంచంలో ఉన్న అస్తవ్యస్తతల నుండి, సంఘర్షణల నుండి, దుఃఖాల నుండి, ద్వేషాల నుండి విముక్తం చెందిస్తారు.

నిజమైన సంక్షోభం

Rishi Valley,
16 December 1984.

మీలో నుండి ఒక ప్రశ్న పుట్టుకొచ్చింది. పవిత్రమైనది ఏది? అది కనిపెట్టకుండా, అది గ్రహించకుండా - అంటే దానిని మీరు కనిపెడతారని కాదు - అంటే ఏమిటంటే అది అస్తిత్వంలోకి రాకుండా, ఆ పవిత్రమైనది అస్తిత్వంలోకి రాకుండా ఒక నవ్య సంస్కృతిని మీరు తీసుకొని రాలేరు. ఒక నవ్యమైన మానవ గుణతత్వం ఉనికిలోకి రాలేదు.

నిజమైన సంక్షోభం

*Madras,
22 October 1947;
The Collected
Works, Vol. IV.*

మీకు మీరే వెలుగు అవాలి... చేతితో చేసిన వాటిలో కానీ, మనసుతో చేసిన వాటిలో కానీ ఏ ఆశా లేదు. ఇది తప్పించుకొని పారిపోవడం కాదు. నేను చెప్తున్నది ఏమిటంటే - కొండ శిఖరం పైన, దాని అంచు చివరన నిలబడి ఎటువంటి కార్యకలాపాలు చేసినా నేల కూలక తప్పదు - అని మీకు సూచిస్తున్నాను. ఆ కొండ శిఖరపు అంచు నుండి దూరంగా ఉండటంలోనే రక్షణ, సంతోషము ఉన్నాయి. అని అంటున్నాను. ఈ గ్రహింపు ఉన్న కొద్ది మంది కాంతి దర్శనపు కేంద్రాలుగా ఏర్పడాలి. ఆ అగాధపు అంచులకు దూరంగా ఉండాలి. ప్రస్తుతం మీరు ఉన్న ఈ సంక్షోభంలో నుండి బయటపడే మార్గం ఉన్నది. అంతేకాదు, మానవ సమస్యలన్నింటి నుండి బయటపడే మార్గం ఉన్నది. ఆ మార్గం పలాయన మార్గం కాదు. ఆ మార్గం శాశ్వతమైన నిశ్చలానందానికి దారి తీస్తుంది.

FOUNDATION INDIA PUBLICATIONS

Krishnamurti Foundation India
Vasanta Vihar, 124, Greenways Road, Chennai - 600028
Tel: 91-44-24937803 / 24937596 | info@kfionline.org | www.kfionline.org